## క్లుప్తంగా

### వైభవంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

### అప్పన్నను దర్శించుకున్న మంత్రి చెల్లుబోయిన



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర సమాచార ,బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

### పెందుర్తి ఎస్‌ఐ చిన్నంనాయుడు బాధ్యతల స్వీకరణ



సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు

**పెందుర్తి:** పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఈ.చిన్నంనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఎస్‌బీలో ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

### మహా ధర్నాకు మద్దతుగా బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

**పరవాడ:** కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఫార్మాసిటీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ మందులు, ఆహారం, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ విధానాన్ని పటిష్టం చేసి ఆహార భద్రత కల్పించాలని, కార్మికుల ప్రయోజనాల కోసం మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్రి వెంకునాయుడు, ఎ.రాజ, కె.పోతినాయుడు, చిన్నరావు, సత్తిబాబు, కృష్ణ, పెంటారావు, కనకారావు, దేముడు పాల్గొన్నారు.

### ధర్నా విజయవంతం చేయండి

**సబ్బవరం:** కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు ఈనెల 27 ,28 తేదీల్లో జరిగే మహాధర్నాకు వందలాదిగా కదిలి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు.సబ్బవరం తహసీల్దార్ కార్యాలయం దగ్గర బుధవారం ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ వి.వి.రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు యు. సత్యవతి, సీఐటీయూ నాయకులు ఎం. గౌరేశ్వరరావు, ఎం.రమణి పాల్గొన్నారు.

ఇది కదా అభివృద్ధి

# సేవాలయాలు




చీమలాపల్లిలోని వార్డు సచివాలయం (ఇన్‌సెట్) సచివాలయంలో ఏర్పాటు చేసిన పథకాలు, సేవల వివరాల జాబితా

- సచివాలయ వ్యవస్థతో చెంతనే పాలన
- పారదర్శకంగా ప్రజల చేతికి సంక్షేమ ఫలాలు
- ప్రజల మోములో ఆనందం

**పెందుర్తి:** అవ్వాతాతలకు తెలతెలవారకముందే పింఛన్లు అందించే వారధి..ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే వలంటీర్లకు సారధి..ప్రభుత్వానికి..సామాన్యులకు సమన్వయకర్త..అదే అత్యుత్తమ, ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వార్డు/గ్రామ సచివాలయం.

**గ్రామ స్వరాజ్యం సాకారం చేసేలా..**

మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారు. ప్రజల చెంతకే పాలన అందించాలనే లక్ష్యంతో సచివాలయ సిబ్బందితో 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. రేషన్‌కార్డు, సామాజిక పింఛన్లు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాధారణ సమస్యల పరిష్కారానికి గ్రామ/వార్డు సచివాలయమే కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు.

**నాడు దూరా భారం**

ఒకప్పుడు మండల కేంద్రంలో ఉన్న కార్యాలయాలకు వెళ్లలేక సామాజన్య ప్రజానీకం ఇబ్బందులు పడేవారు. దీంతో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. నేడు అధికార యంత్రాంగం ప్రజలకు చేరువగా ఉండి సేవలందిస్తున్నారు. నేడు ఏ పని కావాలన్నా పారదర్శకంగా రోజుల వ్యవధిలోనే అవుతోంది. సామాజిక పింఛన్లు ఠంచన్‌గా ఒకటో తేదీన అందించడంతో పాటు అర్హులకు రెండు రోజుల్లో రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారు. ఏ పథకానికైనా ప్రజల వద్దకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లే పనిలేకుండా పూర్తి చేస్తున్నారు. దీంతో సచివాలయ వ్యవస్థ ప్రజల మన్ననలు అందుకుంటుంది.

**అర్హత ఉంటే అన్నీ ఇంటికే..**

గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాలంటే జన్మభూమి కమిటీలను మెప్పించాల్సి వచ్చేది. వారు దయ తలచినా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాలి. అర్జీ పెట్టుకున్న తర్వాత పథకం వర్తించడానికి నెలలు, సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి. చివరకు వచ్చీచెడీ పథకం అందుకుందామంటే 'మేమే మీ పని చేయించాం. మాకు ఎంతోకొంత ఇచ్చుకోవాలి..లేకపోతే జాబితాలో పేరు ఉండదు' అని జన్మభూమి కమిటీ సభ్యుల చేతివాటం.

అయితే 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ ఈ జాడ్యానికి చరమగీతం పాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతీ పథకం అర్హత ఉన్న అందరికీ అందాలి అని క్షేత్రస్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టారు. సామాజిక పింఛన్ల నుంచి ఇంటి స్థలం వరకు ప్రతీది ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పేరు నమోదు చేసుకుని..దాన్ని సచివాలయంలో ధ్రువీకరించి..పథకాన్ని అందించే దృఢమైన పాలనా వ్యవస్థను తీసుకువచ్చారు. ఇంటి వద్దే సంక్షేమం అందుతుండడంతో సర్వాత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.



అర్జీదారుడి సమస్య విని యాప్ ద్వారా అర్హతను పరిశీలిస్తున్న అధికారి



'మాకు పెళ్లి అయ్యి ఎనిమిదేళ్లు కావస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు కోసం తిరిగాను. స్థానిక నాయకులతో పాటు జీవీఎంసీ కార్యాలయం చుట్టూ చాలాసార్లు ప్రదక్షిణ చేశాను. కానీ ఫలితం లేదు. 2019లో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత వలంటీర్ మా వద్ద అర్జీ తీసుకున్నారు. కేవలం రోజుల వ్యవధిలోనే మాకు రేషన్ కార్డు మంజూరు చేశారు. ఇవే కాకుండా ఇతర పథకాలు కూడా మాకు అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ వల్ల ఎంతో మేలు జరుగుతుంది..చీమలాపల్లికి చెందిన నొడగల అనిల్‌కుమార్ దంపతుల మనోగతం.

'జగన్‌బాబు రాకముందు పింఛన్ కోసం రోజంతా పడిగాపులు కాసేవాళ్లం. తిండీ తిప్పలు మాని ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలా కాదు. పొద్దున్నే వలంటీర్ వచ్చి మా పింఛన్ డబ్బులు ఇచ్చి వెళ్లిపోతుంది. ఏదైనా ఇబ్బంది అయితే సచివాలయం సార్లు వెంటనే మా సమస్య తీరుస్తున్నారు.. చీమలాపల్లికి చెందిన మల్లువలస సింహాచలమ్మ ఆనందం ఇది.

| | |
|---|---|
| వార్డు : | 95 |
| మొత్తం వార్డు సచివాలయాలు: | 06 |
| వార్డు జనాభా : | 27,601 మంది |
| సేవలందిస్తున్న వలంటీర్లు : | 117 మంది |
| సచివాలయ ఉద్యోగులు : | 54 మంది |



చినముషిడివాడ సచివాయలంలో సేవలందిస్తున్న సిబ్బంది



పెన్షన్లు అందజేస్తున్న కార్పొరేటర్ దేముడు(ఫైల్)

### రైస్ కార్డు, ఇంటి స్థలం వచ్చాయి



మా జీవితంలో జగనన్న వెలుగులు నింపారు. ఎన్నాళ్ల నుంచో రాని రేషన్‌కార్డు వెనువెంటనే వచ్చింది. ఇటీవలే ఇంటి స్థలం కూడా మంజూరు అయింది. అమ్మ ఒడి క్రమం తప్పకుండా పడుతుంది. వలంటీర్ల ద్వారా సచివాలయ సేవలు మాకు అందుతున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– పి.వసుంధర, బీసీ కాలనీ, పాపయ్యరాజుపాలెం.

### ఎంతో సంతృప్తి



సచివాలయం ఉద్యోగులుగా మేం అనేక మంది పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ప్రతీ నెల ఒకటో తేదిన వలంటీర్లతో వెళ్లి పింఛన్లు ఇస్తుంటే వారి మొహంలో ఆనందం చూస్తే ఎంతో సంతృప్తి కలుగుతుంది. ప్రభుత్వ పథకాల అమలుకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని పనిచేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పథకం వర్తింపజేస్తున్నాం.

– గండి రవిచంద్, సచివాలయం అడ్మిన్, చినముషిడివాడ–2 సచివాలయం.

# అన్ని వర్గాలకూ సంక్షేమం

ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి



ప్రజలకు లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

**పరవాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాససరావు అన్నారు. నాయుడుపాలెం గ్రామంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు, అధికారులతో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మీకు మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని అడిగే దమ్మున్న సీఎం దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఉప సర్పంచ్ రాజాన ముత్యాలు, పార్టీ నాయకులు కూండ్రపు అప్పలనాయుడు, యమహానాయుడు, దాదానాయుడు, బండారు కృష్ణబాబు, కన్నూరి శ్రీను, రాజాన సత్యనారాయణ, వెన్నల రమాదేవి, రొంగలి గంగరాజు, బండారు శ్రీను పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

**పరవాడ:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భరత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరత్ బాలోత్సవ్ కార్యక్రమంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన నృత్య విభాగం బృందం విశేష ప్రతిభ కనబర్చి ఆహుతులను ఆకట్టుకుంది. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులు నృత్య ప్రదర్శనలో తమ ప్రతిభను కనబర్చి ఆహుతుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆ విద్యార్థులను పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

### అప్పన్న దేవస్థానంలో లీజు హక్కులకు వేలం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం లీజు హక్కులు ఖరారు చేయడానికి బుధవారం బహిరంగ వేలం, షీల్డ్ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితికి కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని 1 నుంచి 20 షాపులు లీజు ఇచ్చేందుకు ఈ వేలం నిర్వహించారు. అలాగే సింహగిరి టోల్‌గేట్ వద్ద ఏడాది పాటు టికెట్ల వసూలు చేసుకునేందుకు నిర్వహించిన షీల్డ్ టెండర్ కోటి 20లక్షల 50వేలకు వేశారు. అలాగే సింహగిరిపై భక్తుల పాదరక్షలు భద్ర పరిచేందుకు వేసిన బహిరంగ వేలం పాట 36లక్షల 30వేలు హెచ్చపాటకి వెళ్లింది. అలాగే సింహగిరిపై టీ కాఫీ మిషన్ ద్వారా విక్రయించుకోవడానికి నిర్వహించిన షీల్డ్ టెండర్ 30వేలకు వెళ్లింది. వీటిని ఈవో పరిశీలించి కమిషనర్ ఆమోదానికి పంపించాల్సి ఉంది. దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్‌లు వై.అప్పారావు, రాజ్యలక్ష్మి, గాయత్రి, ఉద్యోగులు దొంతల రమణ, చక్రవర్తి , దేవదాయశాఖ ఉద్యోగి నీలిమ వేలం పాటలు నిర్వహించారు.

### ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు

**సబ్బవరం:** మండలంలోని రావలమ్మపాలెంగ్రామంలో శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి కామాక్షి ముత్యామాంబ పంచదాయిల సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ నారాయణమూర్తితో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 24 వరకు ఆరాధనోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 24న ఉదయం నుంచి స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచదాయిల సంఘ అధ్యక్షుడు పెదగాడివరహాలుబాబు,ఉపాధ్యక్షుడు పెదగాడి కొండబాబు,కార్యదర్శిగౌరీపట్టపు ప్రసాద్,పాలకవర్గ సభ్యులు పొన్నాడ సోమేశ్వరరావు, పొన్నాడ ప్రసాద్,పొన్నాడ ముత్యాలరావు,పెదగాడి కృష్ణ,పెదగాడి మురళి,కర్రీ శివాజీ,పెదగాడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వుడాకాలనీలో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులు



ఘటనాస్థలంలో పరిశీలిస్తున్న పోలీసులు

- కిటికీ గ్రిల్ విరిచి ఇంట్లోకి ప్రవేశం
- కిలో వెండి ఆభరణాలు, రూ.50 వేల అపహరణ



దుండగులు పగలగొట్టిన కిటికీ

**పెందుర్తి:** చినముషిడివాడ సమీపంలోని వుడాకాలనీలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కిలో వెండి వస్తులతో పాటు రూ.50 వేల నగదు అపహరించుకుపోయారు. బుధవారం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..వుడాకాలనీలో నివాసం ఉంటున్న ధర్మారావు దీపావళికి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉన్న పిల్లల వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం వారు ఇంటికి తిరిగి వచ్చారు. అయితే లోపలకి వెళ్లి చూసేసరికి కిటికి కోసేసి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో ఆందోళనకు గురైన ధర్మారావు బీరువా తెరిచి చూడగా అందులోని కిలో వెండి వస్తువులు, రూ.50 నగదు మాయం అయినట్లు గుర్తించాడు. ఇంట్లోని గ్యాస్ సిలండర్, బియ్యం బస్తా, ఇతర చిన్నపాటి సామగ్రిని కూడా దుండగులు పట్టికెళ్లిపోయారు. ఆనవాళ్లు దొరకకుండా ఇంట్లో కారం చల్లడం గమనార్హం. బాధితుని ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. వెస్ట్‌జోన్ క్రైం సీఐ బీవీజే రాజు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

**సబ్బవరం:** ఫ్లోరోసిస్‌పై మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్బవరం,గుల్లేపల్లి పాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రధాన వైద్యాధికారులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ వెంకట రమణ, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం ఫ్లోరోసిస్ రావడానికి గల కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నివారణ చర్యలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

**గోపాలపట్నం:** గంభీరం, హనుమంతువాక కూడళ్లలో ఆటో డ్రైవర్లకు బుధవారం రహదారి నిబంధనలపై రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక బృందాలు చేసిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 8 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు హరిప్రసాద్‌రావు, ఎస్. శ్రీనివాస యాదవ్, ఎస్‌ఐ రాజు తదితరులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

### సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

**సబ్బవరం:** ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. గుల్లేపల్లి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ చేసుకోవాలని పిలుపునిచ్చారు. సచివాలయం సంక్షేమ,అభివృద్ధి పథకాల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, నాయకులు సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,బోను గంగునాయుడు,ఉప సర్పంచ్ గజ్జి దేముడు బాబు,ఎంపీడీవో రమేష్ నాయుడు,ఈవోఆర్‌డీ మహేష్, కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

### నేస్తాలమ్మ ఆలయంలో...

**పరవాడ:** నాయుడుపాలెం శివారు మెట్టపాలెంలో కొలువుదీరిన నేస్తాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బుధవారం ఉదయం పూజారి ఆలయం తలుపులు తెరచి చూడగా హుండీ కనిపించలేదు. మంగళవారం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత సాయంత్రం ఆలయం తలుపులు వేసి పూజారి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగుల గొట్టి లోపలికి చొరబడి లోపల హుండీని ఎత్తుకు వెళ్లారు. ఆరుబయట హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేలు దోచుకుపోయారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హుండీని అక్కడే వదలిపెట్టి వెళ్లిపోయారు. చోరీపై పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.